సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం, 25, ఏప్రిల్, 2023



పుష్పగిరిలో వేడుకగా కల్యాణోత్సవం

పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వాముల కల్యాణోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. - 8లో



పల్లకీలో ఊరేగిన శ్రీ భద్రకాళీ సమేతుడు

శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.72	రూ.86
రెండోరకం	రూ.50	రూ.70

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 298 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	310	550
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 427.56 కిలోలు

ఆహ్లాదతీరం.. ఆనందకరం



పెన్నా, చెయ్యేరు నదులు కలిసిన గుండ్లమాడ వద్ద రెండుకొండల మధ్య దృశ్యం



సోమశిల బ్యాక్‌వాటర్ వద్ద పర్యాటకులు

- ప్రకృతి సోయగాల 'సోమశిల'
- మళ్లీ బ్యాక్‌వాటర్‌లో ఎకోటూరిజంపై దృష్టి
- వనవిహారంతో పర్యాటకం

ఆహ్లాదకర తీరం..పాపికొండలను తలపించే విధంగా వాతవరణం..కనుచూపు మేర జలసోయగం..రెండుకొండల నడుమ ఒయ్యారాలు ఒలికించే పెన్నా నది.. నీటిలో ఎగిరే చేపలు.. దేశ విదేశాల నుంచి వచ్చే విహంగాలు అరుదైన పక్షిజాతుల ఇక్కడి సందడి చేస్తుంటాయి. అదే సోమిశిల వెనుకజలాలు. ఈ ప్రాంతాన్ని పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

రాజంపేట : వైఎస్సార్, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అటవీ ప్రాంతాన్ని అనుసంధానం చేస్తూ పెనుశిల అభయారణ్యం ఏర్పాటుచేయాలని పాతికేళ్ల కిందట ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 1997 డిసెంబరు 15 జీవో నంబరు 106ను జారీ చేశారు. కడప డివిజన్ పరిధిలోని ఒంటిమిట్ట, సిద్ధవటం రేంజ్ పరిధిలో 43,491,608 హెక్టార్లు , నెల్లూరు జిల్లాలోని 40,443,265 హెక్టార్లను అభయారణ్యంలోకి చేర్చారు. ఇక్కడ ఎన్నో రకాల పక్షులు సందడి చేస్తున్నాయి. అరుదైన వన్యప్రాణులు, జలచరాలకు అవాసంగా మారింది.

కోటపాడు నుంచి..

ఒంటిమిట్ట(రాజంపేటనియోజకవర్గం)మండలంలోని కోటపాడు శివారులో సోమశిల వెనుకజలాల్లో ఎకో టూరిజం ఏర్పాటు చేయాలని 2010లో నిర్ణయం తీసుకున్నారు. అదే ఏడాది సెప్టెంబరు 26న ఈ దిశగా అడుగులు పడ్డాయి. తర్వాత రాష్ట్ర విభజన, టీడీపీపాలనలో ఎకో టూరిజం పడకేసింది.ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఎకోటూరిజంతో పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని స్థానిక శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి దృష్టి సారించారు.

సోమశిల జలాశయం నిల్వసామర్థ్యం 77.988 టీఎంసీలు. ప్రస్తుతం 52.3 టీఎంసీలు నిల్వ ఉంది. కోటపాడు, కుడమలూరు, బెస్తపల్లె, ఉప్పరపల్లె, మాధవరం, బోయనపల్లె, చిన్నపురెడ్డిపల్లె, కురుగుంటపల్లె, పొన్నాపల్లి, కొండమాచుపల్లె, మదిలేగడ్డ, గుండ్లమాడ, దొంగలసాని, నెమళ్లగొంది, నర్సనాయనిపేట, వాకమాడ, ఒగూరు, వత్రపురాయి, కొత్తూరు తదితర గ్రామాలు సోమశిల అంతర్భాగంలో ఉండిపోయాయి.

బోటుషికారు ఎప్పుడో..

ఒంటిమిట్ట, నందలూరు, మండలాల్లోని బ్యాక్‌వాటర్‌లో బోటుషికారుకు అనుకూలంగా ఉంటుందని పర్యాటకులు భావిస్తున్నారు. ఒంటిమిట్ట రామాలయం ఇప్పుడు రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకులు, యాత్రికులు ఈ క్షేత్రానికి వస్తుంటారు. అటువంటప్పుడు సోమశిల బ్యాక్‌వాటర్‌లో షికారు చేయడానికి టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.

నిధులు కేటాయింపులిలా..

2020 ఆగస్టు 30న వనవిహారి కోసం రూ.50లక్షలు అనుమతిచ్చారు. 2021 జూలైలో రూ.120 లక్షలతో చేపట్టాలని పరిపాలన ఆమోదం ఇచ్చారు. కోటపాడు శ్రీరామఎత్తిపోతల పంపుహౌస్ సమీపంలో అనువైన స్థలాన్ని ఎంపిక చేశారు. తొలి విడతలో ఆరుపనులను అటవీశాఖ ఉన్నతాధికారులు రూ.42,84,795లతో చేపట్టాలని ఉత్తర్వులిచ్చారు. ఆన్‌లైన్‌లో ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లను ఆహ్వానించారు. గిట్టుబాటుకాదని పనులు చేయడానికి ఎవరు ముందుకురాకపోవడం గమనార్హం. మళ్లీ టెండర్లు పిలవాలని అధికారులు నిర్ణయించారు.

నాటుపడవలో ఎమ్మెల్యే పరిశీలన..

కొడమలూరులో జరిగిన జాతర సందర్భంగా అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే సోమశిల వెనుకజాలలను పరిశీలించారు. అక్కడ ఆయనకు అందుబాటులో నాటు పడవ కనిపించింది. ప్రమాదకరమని తెలిసినా ధైర్యంగా బ్యాక్‌వాటర్‌లో పర్యటించారు. ఒంటిమిట్ట రేంజ్‌కి ఇచ్చిన బోటు పనిచేయక మూలనచేరింది. అయిదేళ్లుగా మరమ్మత్తులకు నోచుకోని సంగతి తెలిసిందే.

ఎకో టూరిజం అభివృద్ధికి కృషి



సోమశిల బ్యాక్‌వాటర్‌లో బోటుషికారు ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో టూరిజం సెంటర్ అభివృద్ధి చేసుకోవాలి. గతంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హయాంలో ఎకో టూరిజం ఏర్పాటుచేశారు.దీనిని పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఒంటిమిట్ట, నందలూరులో కూడా సోమశిల బ్యాక్‌వాటర్ ఉంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి కృషి చేస్తాం

– మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

సత్వరం స్పందన అర్జీల పరిష్కారం

కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచే విధంగా స్పందన అర్జీల పరిష్కారం ఉండాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ విజ్ఞప్తులను స్వీకరించారు. డీఆర్‌ఓ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, జిల్లా అధికారులు తదతరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ అన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. స్పందన అర్జీలు ఎట్టి పరిస్థితిలో పెండింగ్‌లో ఉండకూడదన్నారు.

ఇవీ వినతులు

- ఓబులవారిపల్లె మండలం వై.కోట గ్రామానికి చెందిన ఉషారాణి తన పొలం సర్వే నెంబర్ 30/2లో జాతీయ రహదారి 716లో పోతున్నందున చెట్లకు నష్టపరిహారం చెల్లించాలని విన్నవించారు.
- కలకడ మండలం ఎర్రయ్యగారిపల్లె పరిధిలో రస్తాను ఆక్రమణ చేస్తున్నారని చిన్నక్క, గ్రామ ప్రజలు కలిసి వినతిపత్రం అందజేశారు.
- సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లెకు చెందిన ఎం.ఆనంద్ తన అనుభవంలో ఉన్న భూమిని వేరే వాళ్లు ఆక్రమించుకున్నారని, తనకు న్యాయం చేయాలని కోరారు.
- తంబళ్లపల్లి మండలం బాలిరెడ్డిగారిపల్లికి చెందిన వై.కృష్ణప్ప తనకు చర్మకారుల పెన్షన్ మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.
- పీటీఎం మండలం తుమ్మరకుంట గ్రామానికి చెందిన పలక. నరసింహులు తనకు డీకేటీ పట్టా మంజూరు చేశారన్నారు. ఆ భూమిని ప్రస్తుతం ఇతరులు దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు చూస్తున్నారని, తనకు న్యాయం చేయాలని వారు వినతిపత్రం అందజేశారు.

న్యూస్‌రీల్

25లోగా పేర్లు నమోదు

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లుగా బీఈడీ లో స్పెషల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు స్కూల్ అసిసెంట్లు(స్పెషల్ ఎడ్యుకేషన్)గా పదోన్నతికి ఈనెల 25వ తేదీలోగా తమ పేర్లను డీఈఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని డీఈఓ. రాఘవరెడ్డి తెలిపారు. పదోన్నతి కోసం తగిన ధ్రువీకరణపత్రాలు సమర్పించాలన్నారు. వీటి ఆధారంగా సీనియారిటీ జాబితా తయారు చేసి పదోన్నతులు కల్పించనున్నట్లు డీఈఓ తెలిపారు.

సత్వరం స్పందించాలి



అర్జీని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధర్

రాయచోటి : స్పందన కార్యక్రమం ద్వారా వస్తున్న ప్రజల ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి తద్వారా వారిలో మరింత నమ్మకాన్ని కల్పించాలని జిల్లా ఎస్పీ గంగాధర్ రావు సూచించారు. అన్నమయ్య జిల్లా, రాయచోటి ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించి వాటి పరిష్కారంపై ఆయా ప్రాంత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. స్పందన ద్వారా 48 ఫిర్యాదులు అందాయని, వీటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

రిమ్స్‌కు అదనపు సీట్లు



కేక్ కట్ చేస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ సురేఖ

కడప అర్బన్(వైఎస్సార్ జిల్లా) : ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల(రిమ్స్)లో రేడియాలజీ 5, ఎమర్జెన్సీ మెడిసిన్‌కు ఐదు పీజీ సీట్ల చొప్పున మొత్తం 10 సీట్లు రెండు విభాగాలకు మంజూరయ్యాయి. ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయని రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సురేఖ తెలిపారు.రిమ్స్‌లో ఇప్పటికి 10 విభాగాల్లో 64 పీజీ సీట్లు మంజూరయ్యాయి. దీంతో 20 విభాగాల్లో 108 పీజీ వైద్య విద్య సీట్లకు చేరుకుంది. సోమవారం రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల వైద్యులను, సిబ్బందితో కలిసి ప్రిన్సిపాల్ కేక్ కట్ చేశారు.రేడియాలజీ ఇన్‌ఛార్జ్ హెచ్ఓడి డాక్టర్ డేవిడ్ చక్రవర్తిని ప్రత్యేకంగా అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శంకర్‌రెడ్డి, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



క్రీడాకారిణులను అభినందిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి తదితరులు

కడప స్పోర్ట్స్ : అనంతపురంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో వైఎస్‌ఆర్ జిల్లా బాలికల జట్టు రెండోస్థానంలో నిలిచింది. కడపలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)కు చెందిన నలుగురు విద్యార్థినులు భువనశ్రీ, శ్రీవల్లి, నందిని, శ్రీయలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. వీరిని సోమవారం పాఠశాలలో డీఈఓ వై. రాఘవరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్. వెంకటలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో వర్షాలు

కడప అగ్రికల్చర్ : అల్పపీడన ద్రోణి కారణంగా రాబోయే రెండు రోజుల్లో వైఎస్సార్ జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. మంగళవారం కొన్నిచోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. బుధవారం జిల్లాలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని తెలిపారు.

పేర్లు నమోదు చేసుకోండి

కడప అగ్రికల్చర్ : వైఎస్సార్ జిల్లాలో పసుపు కొనుగోలుకు రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4122 మంది పసుపు రైతులు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు కేవలం 1711 మంది మాత్రమే పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఈ గడువు ఈనెల 27న ముగుస్తుందన్నారు. మిగిలిన వారు త్వరితగతిన పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు అరెస్ట్
- వీరు ఇతర జిల్లాలకు చెందినవారు
- ఇటీవల ఈ ముఠాలోనే ఏడుగురు అరెస్ట్



గంజాయి కేసులో అరెస్టయిన నిందితుల వివరాలను తెలుపుతున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్‌ల పర్యవేక్షణలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాజాప్రభాకర్, ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్, ఎస్‌ఐ కృష్ణంరాజు నాయక్‌లు, సిబ్బందితో కలిసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతలపల్లి మండలం, వట్టిబుసులు గ్రామానికి చెందిన మర్రి సిద్దు అలియాస్ రాజు, అనకాపల్లి జిల్లా రోళ్లగుంట మండలం, బుచంపేట గ్రామంకు చెందిన అద్దాడ కామరాజు, అదేగ్రామానికి చెందిన కన్నూరు నాగేశ్వరరావులు ఉన్నారు. వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కడపలోని 'పెన్నార్' కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఈ కేసు వివరాలను తెలియజేశారు. గంజాయి అక్రమ రవాణా ముఠాలో ఏడుగురిని ఇటీవల జిల్లాలోని ప్రొద్దుటూరు త్రీటౌన్ పరిధిలో అరెస్ట్ చేశామన్నారు. ఇదే ముఠాలోని మరో ముగ్గురిని అరెస్ట్ చేశామన్నారు. వీరిలో మర్రి సిద్దు అలియాస్ రాజు అనే ప్రధాన నిందితుడు చింతపల్లి సమీపంలోని ఏజెన్సీలో గంజాయిని సాగుచేసేవాడన్నారు. ఇతనికి సహాయంగా వున్న మరో ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు. పదేపదే గంజాయి నేరాలకు పాల్పడేవారిపై పి.డి యాక్ట్ ప్రయోగిస్తామని ఎస్పీ హెచ్చరించారు. విద్యాసంస్థల వద్ద మహిళా పోలీసులతో నిఘా ఉంచుతామన్నారు. ప్రజలు కూడా సహకరించాలన్నారు. గంజాయి విక్రయాలు, వినియోగించేవారి సమాచారం డయల్ 100 కు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులతో పాటు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి, నగదు రివార్డులను అందచేశారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

లక్కిరెడ్డిపల్లి : వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చారని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లెలో రూ. 7 కోట్లతో నిర్మాణాలు పూర్తయిన 30 పడకల ఆసుపత్రి భవనాలను సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. పేదవానికి ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్య శ్రీ పటిష్టం చేయనున్నట్లు చెప్పారు. ఆరోగ్య రంగంలో రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందన్నారు. రాయలసీమలోనే తొలిసారిగా 30 పడకల ఆసుపత్రి నిర్మాణాలను పూర్తి చేసుకుని ప్రారంభించుకోవడం హర్షదాయకమన్నారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైస్ చైర్మన్ షాజహాన్, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు విజయభాస్కర్, ఆసుపత్రి సూపరిటెండెంట్ నీలోఫర్ బేగం, ఉప సర్పంచ్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో మమేకం కావాలి



సర్పంచ్‌లు, కార్యదర్శుల సన్మానంలో జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు

రాయచోటి : గ్రామంలో సుపరిపాలన అందించే దిశగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచికలు సమర్థవంతంగా అమలు చేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు అభివృద్ధి సాధనలో మమేకం కావాలని కలెక్టర్ గిరీషా సర్పంచ్‌లకు పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయిలో రైల్వేకోడూరు మండలం వివి కండ్రిక గ్రామ పంచాయితీ నీటి సమృద్ధి కలిగిన గ్రామ పంచాయితీగా ఎంపిక కావడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం -2023 వేడుకలను డీపీవో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీల్లో గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన 17 మంది సర్పంచులు, కార్యదర్శులను కలెక్టర్ గిరీషా పీఎస్, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, జెడ్పీటీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, డీపీవో ధనలక్ష్మిలు /జ్ఞాపికలతో పాటు సరిఫికేట్లు అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయితీల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌పీవోలు ఎంపీడీవోలు, ఈపీఆర్‌డీలు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అవార్డులు

వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ, అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం వీపీఆర్ కండ్రిగ రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికయ్యాయి.

రాయల స్ఫూర్తితో సీఎం జగన్ పాలన





మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, చిత్రంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా తదితరులు, శ్రీకృష్ణదేవరాయల విగ్రహం

శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మదనపల్లె : గొప్ప పరిపాలనాదక్షుడిగా పేరుమోసిన శ్రీకృష్ణదేవరాయలు తన పాలనలో అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేస్తూ, ఆదర్శవంతమైన పాలన అందించినట్లుగానే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కుల,మత, పార్టీ, ప్రాంతాలకు అతీతంగా, పేదలందరినీ ఆదుకునేలా, ప్రతి కుటుంబానికి ఆర్థికంగా వెసలుబాటు కలిప్పించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి అన్నారు. మదనపల్లె బలిజసేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నవాజ్‌బాషా, చింతలరామచంద్రారెడ్డి, ఆరణిశ్రీనివాసులు, రాష్ట్ర కాపుకార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు, టీటీడీ బోర్డ్ మెంబర్ పోకలఅశోక్ కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బలిజసేవాసమితి అధ్యక్షుడు బీపీఎల్.విజయ్ కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి ఆధ్వర్యంలో ముఖ్యఅతిథులకు ఘనస్వాగతం పలికారు. ముఖ్యఅతిథులను మండల వైస్ ఎంపీపీ పసుపులేటిరమణ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగసభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ..శ్రీకృష్ణదేవరాయలు గొప్ప చక్రవర్తిగానే కాకుండా మంచి సాహితీవేత్తగా ఖ్యాతి పొందారన్నారు. చంద్రబాబునాయుడు పాలనలో పేదలకు సమన్యాయం చేసే పరిస్థితి లేదన్నారు. జిల్లా,గ్రామ, మండలస్థాయిలో జన్మభూమికమిటీలు సిఫార్సులు చేసిన వారికి మాత్రమే అరకొర సంక్షేమ పథకాలు అందేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వివక్ష లేకుండా అందరినీ కలుపుకుని పోతూ, అందరికీ మంచిచేసే కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మదనపల్లెలో బలిజకులస్థుల కోసం కల్యాణమండప నిర్మాణానికి ప్రభుత్వస్థలం కోరుతూ బలిజసేవాసమితి అధ్యక్షులు బీపీఎల్.విజయ్‌కుమార్ చేసిన వినతిపై తక్షణమే స్థలం కేటాయించాల్సిందిగా ఆర్డీఓ మురళీని ఆదేశించారు.

- ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ..దేశంలోనే అతిపెద్ద విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించి పరిపాలన ఎలా చేయాలో చేసి చూపించిన పాలనాదక్షుడు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. రాబోవు 1,000 సంవత్సరాలకు ఆయన అందించిన ఆదర్శపాలన రోల్‌మోడల్‌గా ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు నవాజ్‌బాషా, ఆరణిశ్రీనివాసులు మాట్లాడుతూ.. బలిజల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందన్నారు. పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం మదనపల్లె చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు, టీటీడీ బోర్డ్ మెంబర్ పోకలఅశోక్‌కుమార్ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బలిజలకు ఇస్తున్న ప్రాధాన్యత మరే పార్టీలోనూ దక్కడం లేదన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, స్టేట్ ఫోక్,కల్చరల్ చైర్మన్‌నాగభూషణం, పీకేఎం-ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, గజేంద్ర, బోయకొండ ఆలయ చైర్మన్ శంకరనారాయణ, బలిజసేవాసమితి కార్యదర్శి విజయలక్ష్మీభాస్కర్,తోటమదనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి

అధికారులతో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని రాజంపేట ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ పీవీ మిథున్ రెడ్డి ఆయా శాఖల అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో రాజంపేట ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిల ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి సహకార, పర్యవేక్షణ కమిటీ (దిశ) కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట ఎంపీ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులను ఆదేశించారు.

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ జిల్లాలో సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణాలుకోసం దరఖాస్తు చేసుకున్న 3 వేల మంది అర్హులందరికీ వెంటనే పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చి ఇళ్లు మంజూరు చేయించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతు ఉపాధిహామీ పథకం ద్వారా కూలీల సంఖ్యను పెంచి వారికి సకాలంలో డబ్బులు ఇవ్వాలని అన్నారు. గువ్వలచెరువు, రామాపురం, రాయచోటి మున్సిపాల్టీ పరిధిలో అవసరమైనచోట విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు.
- పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ జలకల పథకం చాలా పూర్‌గా ఉందని, ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని డ్వామా పీడీకి సూచించారు. జిల్లాలో కూడా వైఎస్సార్ జలకల పథకం ద్వారా రైతులందరికీ బోర్లు వేసి విద్యుతీకరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.
- ప్రభుత్వవిప్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో 16 జగనన్న హౌసింగ్ లే అవుట్లు ఉన్నాయని, వీటికి విద్యుత్ కనెక్షన్ల వెంటనే ఇవ్వాలన్నారు.
- మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాష మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించినప్పుడే అధికారులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు.
- జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గైరున కట్ట క్రింద పల్లె బాధిత మహిళా కుటుంబానికి విద్యుత్ అధికారులు వెంటనే ఆర్థిక సహాయం అందజేయడం గర్వించదగ్గ విషయమన్నారు. జిల్లా ఎస్పీ గంగాధర్ రావు, డీఆర్‌ఓ సత్యనారాయణ, హౌసింగ్ పీడీ శివయ్య, వ్యవసాయ శాఖ జేడీ ఉమా మహేశ్వరమ్మ, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ, విద్యుత్ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లిలో వెలసిన శ్రీ చౌడేశ్వరి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న దేవతామూర్తుల చిత్ర పటాల ఎదుట ఉంచిన పూజా సామాగ్రిని చిందర వందర చేశారు. అనంతరం హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును అపహరించుకెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇటీవల ఆలయంలో పేరు దేవర్లు కూడా జరిగాయని ఇందులో భాగంగా అమ్మవారికి సమర్పించిన చిన్న చిన్న బంగారు ముక్కు పుడకలు కూడా దోచుకెళ్లినట్లు సమాచారం.

జూదరుల అరెస్ట్

మదనపల్లె : జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు సోమవారం టూటౌన్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. పట్టణంలోని శేషసాయి కళ్యాణ మండపం వెనుక వైపున చెట్ల కింద కొందరు జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.9770 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పుష్పగిరిలో వేడుకగా కల్యాణోత్సవం


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


చెన్నకేశవస్వామి కల్యాణ దృశ్యం


వైద్యనాథుని కల్యాణంలో తాళిని చూపుతున్న పురోహితులు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వాముల కల్యాణోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. వైద్యనాథస్వామి, చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం ఒకే రోజు జరగడం ఇక్కడ విశేషంగా చెప్పవచ్చు. ఉదయం శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై శ్రీ కామాక్షీ వైద్యనాథుల కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపత్తూరు అవధానం, నంద్యాల కుటుంబం వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

■ రాత్రి కొండపై చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలోని మంటపంలో ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవిలతో శ్రీ చెన్నకేశవుని కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం జరిగిన ముత్యాల తలంబ్రాల కార్యక్రమం ప్రత్యేకత సంతరించుకుంది. స్వామి వారి ముత్యాల తలంబ్రాలను పండితులు భక్తులకు ప్రసాదంగా పంచి పెట్టారు. ఈ సందర్భంగా కొండ ప్రాంతమంతా లక్ష్మీ చెన్నకేశవ నామ స్మరణతో మార్మోగింది. అనంతరం ముదిరెడ్డి వెంకట నరేష్‌రెడ్డి, కేతు వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో అన్నదానాన్ని నిర్వహించారు. అనంతరం ఊంజల్ సేవను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఈవో మహేశ్వరరెడ్డి, అర్చకులు సుమంత్ దీక్షితులు, చెంచు సుబ్బయ్య, ఉభయ దారులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు

కాగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత శ్రీచెన్నకేశవ స్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి రెండు గంటల సమయంలో స్వామివారిని కొండ పైనుండి పల్లకిలో మోస్తూ బాణా సంచా పేలుస్తూ, గ్రామ మాడ వీధులలో గ్రామోత్సవం న్విహించారు. నదిలో నుండి గ్రామంలోకి వస్తున్న స్వామిని చూడడానికి, పల్లకిని మోయడానికి భక్తులు పోటీలు పడ్డారు. స్వామివారి గరుడ వాహన సేవను చూడటానికి రాత్రంతా పుష్పగిరిలోనే వున్న వేలాది మంది భక్తులు గ్రామోత్సవంలో స్వామివారిని దర్శించుకుని తరించారు.

నేడు రథోత్సవాలు

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి రథోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవుల రథోత్సవం జరుగుతుంది.

పల్లకీలో ఊరేగిన శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మూల విరాట్‌లకు పూజలు నిర్వహించి రంగు రంగు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. పల్లకీలో ఉంచి ఆలయ మాడవీధులలో ఊరేగించారు. ఈ పల్లకీలో ఉత్సవం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు నాగభూషణం, సురేష్ బాబు, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు.


శ్రీ భద్రకాళీ సమేతుడిని పల్లకీ సేవకు సిద్ధం చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

కల్లూరు ఎద్దులు ఫస్ట్


బహుమతులను అందజేస్తున్న చెన్నకేశవరెడ్డి, మల్లికార్జునరెడ్డి

వల్లూరు : పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భారతి సిమెంట్ పరిశ్రమ సౌజన్యంతో ఆదివారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో ప్రారంభమైన ఓల్డ్ కేటగిరి బండలాగుడు పోటీలు మంగళవారం తెల్లవారుజాము 2 గంటల వరకు సాగాయి. ప్రొద్దుటూరు మండలం కల్లూరుకు చెందిన శివ కృష్ణ యాదవ్ ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. కమలాపురం మండలం పుత్తా నాగ సుబ్బారెడ్డి ఎద్దులు రెండవ స్థానంలో, ప్రొద్దుటూరు మండలం ఖాదరా బాద్‌కు చెందిన నాగ సుబ్బారెడ్డి ఎద్దులు మూడవ స్థానంలో నిలిచాయి. నంద్యాల టౌన్‌కు చెందిన అనూష రెడ్డి ఎద్దు, తెలంగాణా రాష్ట్రం ఇటిక్యాల మండలానికి చెందిన చక్రవర్తి గౌడ్ ఎద్దు కలిసి నాలుగవ స్థానంలో, చాపాడు మండలం సాయి గణేష్ శర్మ ఎద్దు, ప్రొద్దుటూరు మండలం కల్లూరుకు చెందిన నాగేష్ ఎద్దు కలసి ఐదవ స్థానంలో నిలిచాయి. వేముల మండలం మూలె రామ సుబ్బారెడ్డి ఎద్దులు ఆరవ స్థానంలో, గోపవరం మండలం నెమలయ్య ఎద్దులు ఏడవ స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.60,116 నరేందర్ రెడ్డి, మహేంద్రారెడ్డి (ఎంఆర్ హోండా ప్రొద్దుటూరు), రెండవ బహుమతి రూ.50,116 తోట ప్రభాకర్ (ఐగ్రో వర్చువల్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్), మూడవ బహుమతి రూ. 40 ,116 బలుసా చంద్ర (శ్రీనివాస ప్లైవుడ్, కడప), నాలుగవ బహుమతి రూ.30,116, ఐదవ బహుమతి రూ.20,116 లను భారతి సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్, నల్లింగాయపల్లె, ఆరవ బహుమతి రూ.12,116 గోటూరుకు చెందిన పాన్నోలు శివ కుమార్ రెడ్డి, ఏడవ బహుమతి రూ. 8,116 సంతకొవ్వూరుకు చెందిన బండి లక్ష్మిరెడ్డి విరాళంగా అందచేశారు. ఇవి కాకుండా పోటీలలో పాల్గొన్న మిగిలిన ఐదు జతల ఎద్దులకు కన్సోలేషన్ బహుమతుల కింద ఒక్కో జతకు రూ. 4 వేల చొప్పున భారతి సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్, నల్లింగాయపల్లె వారు విరాళంగా అందచేశారు. విజేతలకు ఎర్రగుడిపాడు చెన్నకేశవరెడ్డి, కే మల్లికార్జునరెడ్డిల చేతుల మీదుగా నగదు బహుమతులను, ట్రోఫీలను అందచేశారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాడా గౌతం

సిద్దవటం : మండలంలోని గంగానగర్ వద్ద కడప-చెన్నై ప్రధాన రహదారిలో ఆదివారం రాత్రి ద్విచక్రవాహనాన్ని వెనుక వైపున లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన మాడా గౌతం(11) అనే బాలుడు మృతి చెందాడని సిద్దవటం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్త మాధవరానికి చెందిన మాడా క్రాంతికిషోర్, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు గౌతం కొత్త మాధవరం లోని జిల్లా పరిషత్ ఉన్నపాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. అయితే క్రాంతికిషోర్, చిన్నకుమారుడు మాడా గౌతమ్‌లు ఆదివారం రాత్రి మిట్టపల్లె డాబా వద్దకు భోజనం పార్సిల్ తెచ్చుకునేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్లారు. వీరి వాహనం చాముండేశ్వరీపేట దాటుకొని గంగానగర్ వద్దకు వెళ్లగానే వేంపల్లెకు చెందిన లారీ తిరుపతి నుంచి కడపకు వస్తూ వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రి కొడుకులు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో కుమారుడు గౌతమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి క్రాంతి కిషోర్‌కు స్వల్ప గాయాలు కావడంతో వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : అదనపు కట్నం తేవాలంటూ వేధించిన వారిపై కేసు నమోదు చేసినట్లు సోమవారం తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. బసినికొండపై వివేకానంద నగర్‌కు చెందిన ఎ.శోభారాణికి 2022 ఆగస్టు 22వ తేదీన పట్టణానికి చెందిన సాయితరుణ్‌తో పెళ్లి జరిగింది. పెళ్లి సమయంలో 24 తులాల బంగారు, రూ.15 లక్షల కట్నం, 500 గ్రాముల వెండి ఇచ్చి పెళ్లి చేశారు. వివాహమైన నెల రోజులు మాత్రమే వీరి కాపురం సజావుగా సాగిందని, తర్వాత అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నట్లు బాధితురాలు సోమవారం ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు భర్త సాయితరుణ్ అతని కుటుంబ సభ్యులు సుజాత, శోభారాణి, లోకేష్, గణేష్, శ్రీలక్ష్మి, నిరంజన్‌లపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మృకుండాశ్రమం సమీపంలో ఆదివారం రాత్రి రైలు కింద పడి యువకుడు మృతి చెందినట్లు సోమవారం రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. రైల్వే ఎస్ఐ వివరాల మేరకు.. మండల పరిధిలోని మృకుండాశ్రమానికి చెందిన మురారి కృష్ణయ్య కుమారుడు మురారి సురేష్(26) అనే యువకుడికి ఈ మధ్య కాలంలో వారి తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, కానీ అందులో ఒక్కటి కూడా కుదరలేదు. దీంతో మనస్తాపానికి గురైన సురేష్ చనిపోవాలనే ఉద్దేశంతో ఆదివారం రాత్రి మృకుండాశ్రమానికి సమీపంలో ఉన్న రైలు పట్టాలపై వస్తున్న గూడ్స్ రైలు కింద పడి చనిపోయాడని తెలిపారు. సురేష్ మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించడంతో సమాచారం అందుకున్న తమ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.


కుంటలో పడి బాలిక మృతి

గాలివీడు : మండల కేంద్రం సమీపంలో అరవీటివాండ్లపల్లె కుంటలో బాలిక మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. అరవీటివాండ్లపల్లె కుంట సమీపంలో కుమారి, గోపాల్ దంపతులు నివాసం ఉండేవారు. వీరి కుమార్తె వసంత(10). కాగా ధోబి పనుల్లో భాగంగా రోజువారిగా తల్లి వెంట కుంటలోకి దుస్తులు ఉతకడం కోసం వసంత వెళ్లింది. దుస్తులు తల్లి, కూతురు ఉతుకుతూండగా ప్రమాదశాత్తు వసంత కుంటలో పడింది. కొద్ది నిమిషాల వ్యవధిలోనే తల్లి కేకలు వేయడంతో అక్కడే ఉన్న బంధువులు , కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని గాలించగా అప్పటికే వసంత మృతి చెందింది. ఈ మేరకు ఎస్ఐ వెంకట శివప్రసాద్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మదనపల్లె : తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగలు, నగదు అపహరించుకుని వెళ్లిన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు.. మదనపల్లె మండలంలోని కొత్తయిండ్లు పంచాయతీ రంగారెడ్డికాలనీకి చెందిన దామోదర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. ఆదివారం రాత్రి తిరిగి ఇంటికి రాగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటంతో లోనికి వెళ్లి చూశాడు. ఇంట్లో బీరువాల తలుపులు తెరచి, అందులోని వస్తువులు కిందపడేసి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే తాలూకా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో సీఐ సత్యనారాయణ సిబ్బంది వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు. డీఎస్పీ కేశప్ప ఆదేశాలతో క్లూస్ టీం బృందం తనిఖీ చేసింది. దుండగులు 40 గ్రాముల బంగారు, రూ.1.50 లక్షల నగదు అపహరించుకుని వెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫారెస్ట్ అధికారుల అదుపులో అలుగు



సంబేపల్లె : సంబేపల్లె మండల కేంద్రంలో పాన్గోలిన్ జాతికి చెందిన అలుగును సానిపాయి ఫారెస్ట్ అధికారి పీరయ్య సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సానిపాయ ఫారెస్ట్ రాయ వరం సెక్షన్, టి.సుండుపల్లె బీట్ పరిధిలోని సంబేపల్లె మండల కేంద్రంలో అలుగును కొందరు బంధించారని తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి అలుగును బంధించిన వారిపై కేసునమోదు చేసి, దానిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చింతకాయల విషయంపై ఇరువర్గాల ఘర్షణ

మదనపల్లె : చింతకాయల విషయమై వివాదం ఏర్పడి జరిగిన ఘర్షణలో పదిమంది గాయపడిన సంఘటన సోమవారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. రేణుమాకులపల్లె పంచాయతీ పల్లెకుంటపల్లెలో సోమవారం గ్రామానికి చెందిన చింతచెట్లలో కాయల విషయమై ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఓ వర్గానికి చెందిన చంద్రమోహన్ (42), రాణెమ్మ (47), విశ్వనాథ్ (45), వై.వెంకటరమణ (53), భాగ్యమ్మ (20) గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వీరందర్ని రాత్రి మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో వర్గానికి చెందిన రమణ (50)తోపాటూ చలపతి, రమణప్ప, తిమ్మయ్య, మల్లికార్జునతోపాటు పలువురు గాయపడ్డారు. వీరిలో చంద్రమోహన్ వర్గం మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి రాగా రమణ వర్గీయులు తంబళ్లపల్లె ఆసుపత్రికి వెళ్లారు. తంబళ్లపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవజాత శిశువులకు కార్పొరేట్ వైద్యం అందించండి


జిల్లా ఆసుపత్రిలో తనిఖీ నిర్వహిస్తున్న కేంద్ర ముస్కాన్ బృంద సభ్యులు

మదనపల్లె : జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నవజాత శిశువులకు కార్పొరేట్ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ కేంద్ర ముస్కాన్ బృందం వైద్యులకు సూచించింది. సోమవారం స్థానిక జిల్లా ఆసుపత్రిని కేంద్ర ముస్కాన్ సభ్యులు డాక్టర్ బీరజ్ చంద్రపాల్, డాక్టర్ మనోజ్‌కుమార్‌లు తమ బృందంతో కలిసి తనిఖీ చేశారు. అందులో భాగంగా ఆసుపత్రిలోని ఓపీ విభాగం, చిన్నపిల్లలకు వైద్య సేవలు అందించే ఓపీ, ఎస్ఎన్‌సీయూ డీఈఐసీ, చిన్నపిల్లల చికిత్స పొందే పలు విభాగాలను పరిశీలించారు. వివరాలు సేకరించారు. ఆసుపత్రిలో పిల్లలకు అందుతున్న సేవలు వారి కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ప్రతిరోజూ ఎంతమంది పిల్లలు ఆసుపత్రికి వస్తున్నారో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యి చికిత్సలు పొందుతున్న వారి వివరాలను పరిశీలించారు. నవజాత శిశువు చికిత్సా విభాగంలో పురిటి బిడ్డలకు అందుతున్న వైద్య సేవలు, మెటర్నిటీ వార్డులో అప్పుడే పుట్టిన పిల్లలకు మందులు, సౌకర్యాలను తనిఖీ చేశారు. పలు విభాగాల్లో వివరాలను సేకరించారు. తాము సేకరించిన వివరాలను కేంద్ర క్వాలిటీ విభాగానికి నివేదిక రూపంలో అందజేయడం జరుగుతుందన్నారు. నివేదిక ఆధారంగా ఆసుపత్రికి గ్రేడింగ్ కేటాయిస్తారన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతిదేవి, ఆర్ఎం డాక్టర్ దివాకర్, డాక్టర్ పాల్‌రవికుమార్, రత్నాకర్, మధుసూదన్, సంపూర్ణమ్మ, సురేష్ రెడ్డి, కంటి విభాగ వైద్యులు ప్రసాద్‌రాజు, సుబహాని, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉర్దూమానిటరింగ్ అధికారిగా హాషిం


హాషింకు నియామక ఉత్తర్వులు అందచేస్తున్న డీఈఓ పురుషోత్తం

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా ఉర్దూ పాఠశాలల మానిటరింగ్ అధికారిగా ప్రభుత్వ ఉన్నతపాఠశాల, నేతాజిసర్కిల్‌లో పనిచేస్తున్న ఉర్దూ ఉపాధ్యాయుడు యస్‌యండి హాషింను డీఈఓ పురుషోత్తం నియమించారు. ఈమేరకు సోమవారం తన కార్యాలయంలో హాషింకు నియామక పత్రాలను అందచేశారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాలోని ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి కృషచేయాలన్నారు. కాగా ఉర్దూపాఠశాలల మానిటరింగ్ ఆఫీసర్‌గా హాషిం నియామకం పట్ల ఎస్టీయు రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, జిల్లా మైనార్టీ కన్వీనర్ మున్వర్ బాష, యూటీఎఫ్‌నేతలు జాబీర్, రూటా నేతలు సిబాతుర్ రహి మాన్, అసద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

హత్యకేసులో ఇద్దరు అరెస్ట్


కేసు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ నాగరాజు

ఎర్రగుంట్ల : ఓ వ్యక్తి హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని సిర్రాజుపల్లి పరిధిలో సపోటా తోటను కౌలుకు తీసుకుని జీవిస్తున్న గొడ్డు మురళి(55) అనే వ్యక్తిని సింగన్నగారి శేఖర్, తలారి అశోక్‌లు హత్య చేశారని జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు తెలిపారు. కేసు వివరాలను సోమవారం యర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో ఆయన పట్టణ సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐ వెంకట క్రిష్ణయ్యలతో కలసి విలేకరులకు వివరించారు. సిర్రాజుపల్లికి చెందిన మాధవరెడ్డి సపోటా తోటను తాడిపత్రి మండలం వంగనూరుకు చెందిన గొడ్డు మురళి కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. మురళి చిలంకూరులో నివాసం ఉండేవాడు. అయితే 25 రోజులుగా మురళి కనిపించకపోవడంతో ఈ నెల 21వ తేదీన మాధవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మంజునాథ్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఎస్ఐ వెంకట క్రిష్ణయ్య కేసు విచారణ నిమిత్తం చిలంకూరులో విచారణ చేయగా నిందితులైన సింగన్నగారి శేఖర్, తలారి అశోక్‌లు వీఆర్ఓ మునెయ్య వద్దకు వచ్చి లొంగిపోయారు.

కాగా.. గొడ్డు మురళి సపోటా తోటను కౌలుకు తీసుకున్న క్రమంలో శేఖర్ కుటుంబంతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో శేఖర్ భార్య సుబ్బమ్మతో మురళి చనువుగా ఉండేవాడు. అయితే పది నెలల కిందట నుండి శేఖర్ బంధువు అయిన తలారి అశోక్ కూడా సుబ్బమ్మతో చనువుగా ఉండటం మురళికి తెలిసింది. దీంతో మురళి తరుచూ శేఖర్‌ను, సుబ్బమ్మను తిడుతూ ఉండేవాడు. అవమాన పరుస్తూ ఉండేవాడు. దీంతో ఎలాగైనా మురళిని అడ్డం తొలగించుకోవాలని శేఖర్, అశోక్‌లు పథకం వేశారు. ఈమేరకు మార్చి 26వ తేదీ తెల్లవారుజామున శేఖర్, అశోక్‌లు సిర్రాజుపల్లి సమీపంలో తుమ్మల బావి వద్ద మాటు వేశారు. కొద్ది సేపటికి మురళి చిలంకూరు నుంచి రావడం చూసి వారిద్దరు కట్టెలతో మురళిని బలంగా కొట్టారు. మురళి గొంతుపై కాలుతో నులుమి చంపేశారు. ఆ తర్వాత శవంను డీజిల్‌తో నిప్పుపెట్టి కాల్చి వేశారు. కాగా.. ఈ కేసులో శేఖర్, అశోక్‌లను నిందితులుగా తేల్చి అరెస్టు చేశామని.. వీరితోపాటు సుబ్బమ్మను కూడా అరెస్ట్ చేశామని డీఎస్పీ నాగరాజు తెలిపారు.